క్లుప్తంగా

ప్రసన్నాంజనేయుడికి విశేష పూజలు



చేబ్రోలు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పి.శివశర్మ ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయస్వామికి పంచామృత అభిషేకములు నిర్వహించారు. చేబ్రోలుకు చెందిన శ్రీ రాములమ్మతల్లి భజన సమాజం వారితో భజన కార్యక్రమం జరిపారు. పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీరాంజనేయుడికి నృత్య నీరాజనం




చేబ్రోలు: చేబ్రోలులోని వీరాంజనేయస్వామి ఆలయంలో 41వ హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి చిన్నారుల నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానిక కోనేరు వద్ద గల సువర్చల సమేత వీరాంజనేయస్వామి దేవస్థానంలో సాంస్కృతిక కళా వేదిక ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి, భరత నాట్య ప్రదర్శన చేశారు. పోలం రేన్యశ్రీ, రుషిక, ఇంటూరి హాసిని, మద్ది హరిత ప్రియ, పునర్విక, మేఘనలు వివిధ ప్రదర్శనలు చేశారు. కార్యక్రమం అనంతరం ఆలయ కమిటీ చిన్నారులను ఘనంగా సత్కరించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ప్రత్తిపాడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని గొట్టిపాడు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పి.మాధవి అన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం లింగ వివక్ష, అసమానతలపై కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌమార ప్రాయంలో ఉన్నవారు, బాల్యం నుంచి వయోజనులుగా మారే దశలో ఉన్నవారి పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. లింగ వివక్ష చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ దేశ అభివృద్ధిని నిరోధిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అలుముకున్న చీకట్లు



పొన్నూరు: పట్టణ పరిధి డీవీసీ కాలనీలోని పలు వీధుల్లో కొన్ని రోజుల నుంచి వీధి దీపాలు వెలగడంలేదు. సంబంధిత సిబ్బందికి ఎన్నిసార్లు సమస్యను తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వీధుల్లో లైట్లు వెలగకపోవడంతో వృద్ధులు, చిన్నారులు చీకట్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళ వాహనదారులు చీకట్లో దారి కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా లక్ష నాగవల్లీ దళార్చన

నగరంపాలెం: స్థానిక పాతగుంటూరు విశాఖ శ్రీశారదాపీఠ పరిపాలిత శ్రీవీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో వీరాంజనేయ స్వామి జయంతి ఉత్సవాలు మంగళవారం మూడో రోజుకి చేరాయి. ఉదయం కంకణ ధారణ, గణపతి హోమం, లక్ష్మీనారాయణ హోమం, ఆంజనేయ హోమం, సుందరకాండ హోమం నిర్వహించారు. అనంతరం లక్ష నాగవల్లీ దళార్చన వైభవంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పురావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు, సభ్యులు ఆత్మకూరి లక్ష్మణరావు, సురేంద్రకుమార్, తవ్వా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోర్టు వాయిదాలకు రాని నిందితుడు అరెస్టు

మంగళగిరి: కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని అరెస్ట్ చేసినట్లు మంగళగిరి ఎస్‌ఐ సీహెచ్ వెంకట్ తెలిపారు. విజయవాడ కొత్తపేటకు చెందిన సింహ దుర్గారావు కోర్టు వాయిదాలకు హాజరు కావడంలేదని జడ్జి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు నిందితుడు దుర్గారావును మంగళవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరుచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

రేషన్ కార్డు దరఖాస్తుకు అవాంతరాలు!

- సచివాలయాల్లో దరఖాస్తుకు అప్లికేషన్లు నిల్
- ఇబ్బందులు పడుతున్న అర్జీదారులు



ప్రత్తిపాడు: ప్రత్తిపాడుకు చెందిన ఓ యువకుడు మంగళవారం సాయంత్రం ప్రత్తిపాడు-2 సచివాలయానికి వెళ్లాడు. కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని.. అప్లికేషన్ ఇవ్వాలని సిబ్బందిని కోరాడు. ఇక్కడ ఏ-4 తెల్లపేపర్లు లేవని, బయట జిరాక్స్ సెంటరుకో లేక నెట్ కేఫ్‌కో వెళ్లి దరఖాస్తు తెచ్చుకోవాలని సిబ్బంది సూచించారు. ఏం చేయాలో పాలుపోక సుమారు కిలో మీటరు వెనక్కి వెళ్లి అప్లికేషన్ తెచ్చుకున్నాడు. యువకుడు కాబట్టి వెళ్లగలిగాడు.. ఏ వృద్ధుడో, మహిళనో అయితే వారి పరిస్థితి ఎలా ఉంటుందనేది ప్రశ్న. ప్రత్తిపాడులో ఈ సమస్య ఎంతో మందికి షరా మామూలేనని ప్రజలు వాపోతున్నారు.

> కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక పక్క సర్వర్ మొరాయిస్తుండడం, మరో పక్క ఈకేవైసీ సమస్య, ఇంకో వైపు సచివాలయాల్లో స్టేషనరీ సమస్యలతో నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. దరఖాస్తుదారులు గంటల తరబడి సచివాలయాల్లో నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

ఆన్‌లైన్‌కు సర్వర్ లేక..

ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణతో పాటు, మార్పులు, చేర్పుల కోసం తాజాగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ప్రత్తిపాడు మండలంలోని 13 గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు దరఖాస్తులు తీసుకుంటున్నప్పటికీ వాటిని ఆన్‌లైన్ చేసే క్రమంలో ఇబ్బందులు తప్పడంలేదు. సర్వర్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక పోతుండడంతో కంప్యూటర్లుతో కుస్తీలు పట్టాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే దరఖాస్తు నమోదు ప్రక్రియకు కూడా అత్యధిక సమయం పడుతుండడంతో దరఖాస్తుదారులతో పాటు సచివాలయ సిబ్బందికీ కష్టాలు తప్పడం లేదు. దాదాపుగా అన్ని సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని అధికారులు చెబుతున్నారు.

ఈకేవైసీ కాక..

నూతన రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారితో పాటు కార్డులో ఉండే సభ్యులందరూ కచ్చితంగా ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఈకేవైసీ కాకపోతుండడంతో కార్డు దరఖాస్తు ప్రక్రియ పూర్తియ్యిందో, అవ్వలేదో కూడా అర్థం కాని అయోమయ పరిస్థితి చోటుచేసుకుంది. దీంతో సచివాలయాలు, వీఆర్వోల చుట్టూ దరఖాస్తుదారులు ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి కనిపిస్తుంది.

స్టేషనరీ లేక.. అప్లికేషన్ ఇవ్వక..

దరఖాస్తుదారులకు ప్రత్తిపాడులో విచిత్రమైన సమస్య ఎదురవుతుంది. గత ప్రభుత్వ హయాంలో ఏ అప్లికేషన్ కావాలన్నా సచివాలయంలో ప్రింట్ తీసి దరఖాస్తుదారులకు అందించేవారు. చదువుకోనివారైతే అక్కడ ఉన్న సిబ్బంది లేదా వాలంటీర్లు అప్లికేషన్ పూర్తి చేసి ఇచ్చేవారు. కానీ కూటమి ప్రభుత్వంలో దరఖాస్తుకూ కష్టాలు తప్పడంలేదు. సచివాలయాల్లో స్టేషనరీ లేకపోవడంతో దరఖాస్తులు బయట జిరాక్స్ సెంటర్లు నుంచి తెచ్చుకోవాలని సచివాలయ సిబ్బంది అక్కడకు వచ్చిన వారిని వెనక్కి పంపిచేస్తున్నారు. దీంతో కాళ్లకు పని చెప్పి దరఖాస్తుదారులు జిరాక్స్ సెంటర్లుకు పరుగులు పెడుతున్నారు. ఈ పరిస్థితి ప్రత్తిపాడులోని ప్రత్తిపాడు-1, 2, 3 సచివాయల్లో ఎక్కువగా కనిపిస్తోంది.

గుంత.. ప్రమాదాలతో చింత!

పట్టణంలోని ప్రధాన రహదారి అధ్వాన్నంగా ఉంది. కనీస నిర్వహణ లేక పలు ప్రాంతాల్లో రోడ్డు గుంతలమయంగా దర్శనమిస్తోంది. ఈ దారిలో ప్రయాణించాలంటే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనపడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ప్రధానంగా మున్సిపల్ కార్యాలయం, ఆర్టీసీ డిపో, కూరగాయల మార్కెట్ వద్ద లోతైన గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. - పొన్నూరు



గుంతలతో అధ్వాన్నంగా ప్రధాన రహదారి

కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు



బలసానిని సత్కరిస్తున్న హనుమంత్‌యాదవ్

ప్రత్తిపాడు: పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని, ఏ ఒక్కరినీ పార్టీ విస్మరించబోదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. ప్రత్తిపాడు మండల అధ్యక్షుడిగా తుమ్మలపాలెం గ్రామానికి చెందిన చల్లా హనుమంత్ యాదవ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం ఆత్మీయ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చల్లా హనుమంత్ యాదవ్ బలసాని కిరణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బలసానిని ఘనంగా సత్కరించారు. బలసాని మాట్లాడుతూ.. దశల వారీగా ప్రాధాన్యతా క్రమంలో పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకూ తగిన సమయంలో తగిన గుర్తింపు, గౌరవం ఇస్తామని అన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవ మేధకు కృత్రిమ మేధ సవాల్

ఎన్‌ఐసీ విశ్రాంత డైరెక్టర్ జనరల్ సీఎస్‌ఆర్ ప్రభు



సీఎస్‌ఆర్ ప్రభును సత్కరించిన ఎలైట్ ఫోరం ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: మానవ మేధకు సవాల్ విసిరే స్థాయికి కృత్రిమ మేధ చేరుకుంటోందని నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ విశ్రాంత డైరెక్టర్ జనరల్ సీఎస్‌ఆర్ ప్రభు పేర్కొన్నారు. మంగళవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గుంటూరు ఎలైట్ ఫోరం ఆధ్వర్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో కృత్రిమ మేధ సామాజికంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దాని ప్రభావంపై సదస్సు నిర్వహించారు. ప్రభు మాట్లాడుతూ ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్‌తో భవిష్యత్‌లో మానవ మనగడకే ప్రమాదం సంభవించనుందని ఆందోళన వ్యక్తం చేశారు. మానవ మేధను కృత్రిమ మేధ దాటవేసి మానవులను తన ఆధీనంలోకి తీసుకోవాలని ప్రయత్నించే సందర్భంలో ఘర్షణ ఏర్పడే ప్రమాదముందని వివరించారు. ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, డీప్ ఫేక్ అనేక రంగాలను ప్రభావితం చేసే దిశగా దుండగులు ఉపయోగిస్తున్నారని, దీనిపై రెగ్యులేటరీ అథారిటీ అనేది తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఏఏ రంగాలు ప్రభావితం అవుతున్నాయనే విషయంపై ఆచితూచి అడుగు వేసేదిగా ప్రభుత్వం కఠిన చర్యలను రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కృత్రిమ మేధతో పాటు మిషన్ లెర్నింగ్‌పై తాను రాసిన పుస్తకాలను పరిచయం చేశారు. ఏఐతో రాబోవు రోజుల్లో ఎంతో మంది ఉద్యోగాలను కోల్పోయే ప్రమాదముందని, అయితే కొత్త ఉద్యోగాలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, ఎలైట్ ఫోరం ప్రతినిధులు సింగం లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎస్వీ రమణ, డాక్టర్ కాకాని పృధ్వీరాజ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ వెబ్ సైట్‌లో పెట్టుబడి పేరుతో మోసం

లక్ష్మీపురం: మొబైల్ ఫోన్‌లో ఓ మెసేజ్ ద్వారా ఆన్‌లైన్ రేటింగ్ పేరుతో ఓ బాధితుడు నుంచి రూ.19 లక్షలుపైగా నగదు ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడి పెట్టించి మోసం చేసిన ఘటనపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. మెడికల్ కళాశాల రోడ్డులోని రైల్వే క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన అభిరామ్, ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. మార్చి 7వ తేదీన అభిరామ్ మొబైల్ ఫోన్‌కు యక్సోటికా వెబ్ సైట్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా అధిక మొత్తంలో లాభాలు పొందవచ్చని మెసేజ్ వచ్చింది. దీంతో అభిరామ్ యక్సోటికా వెబ్‌సైట్‌ను పరిశీలించగా ఈ వెబ్‌సైట్ ఆన్‌లైన్ రేటింగ్ సంస్థ అని పెట్టుబడి పెట్టిన వారికి కమీషన్ రూపంలో అధిక లాభాలను వస్తాయని ఉంది. దీంతో నమ్మిన అభిరామ్ ముందుగా రూ.10 వేలు పెట్టుబడి పెట్టడంతో దాంతో రూ.16 వేలు నగదు వాపసు చేశారు. మళ్లీ రెండు సార్లు కూడా రూ.10 వేలు చొప్పున పెట్టుబడి పెట్టడంతో రూ.16 వేలు లాభంతో నగదు ఆన్‌లైన్ ద్వారా పంపించారు. దీంతో పూర్తిగా నమ్మిన అభిరామ్ పలు దఫాలుగా సుమారు రూ.10 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాడు. అయితే మొదట్లో వచ్చిన విధంగా లాభ డబ్బు వాపస్సు పంపించక పోవడంపై పలు మార్లు సంస్థకు సంబంధించిన ఆన్‌లైన్‌లో మాట్లాడటంతో దీనికి ఒక 50 మందికి పైగా గ్రూప్ సభ్యులు ఉంటారని విడతల వారిగా వరస క్రమంలో నగదు వస్తుందని చెబుతూ కాల యాపన చేయడం ప్రారంభించారు. అభిరామ్ రూ.19 లక్షల నగదు అప్పులు చేసి బంగారం తాకట్టు పెట్టి తెచ్చి ఇవ్వడంతో ఆందోళన చెందుతూ సైబర్ క్రైం పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన మరుక్షణమే అభిరామ్ ఖాతాను నిలుపుదల చేయడంతో అభిరామ్ ఖాతాలో కేవలం రూ.90 వేలు మాత్రమే ఉన్నట్లు వాటిని ఆ వెబ్ సైట్ సంస్థ నగదు తీసుకోకుండా నిలుపుదల చేశారు. దీంతో అభిరామ్ దిక్కుతోచక నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లికి వందనం ఎగ్గొట్టిన ఘనత బాబుదే

పెదకాకాని: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ విద్యకు విఘాతం కలిగిస్తోందని గుంటూరు జిల్లా బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన విద్యాభివృద్ధిపై దేశం మొత్తం ఏపీ వైపు చూసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోజు రోజుకూ ప్రభుత్వ విద్యా వ్యవస్థ మసకబారుతోందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నోచుకోలేదన్నారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం ఇస్తామని చెప్పి తొలి ఏడాది ఎగ్గొట్టారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యా వ్యవస్థ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, తల్లికి వందనం పథకం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

పొన్నూరు: మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే తగిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ వీరానాయక్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఐలాండ్ సెంటర్‌లో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లను ఆపి వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రోజు రోజుకూ ట్రాఫిక్ పెరుగుతున్న తరుణంలో మైనర్లు వాహనాలు నడపడం ప్రమాదకరం అన్నారు. వారు ద్విచక్ర వాహనాలు నడిపే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించవద్దని తెలిపారు.

ఇకపై మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నేటి నుంచి శ్రీ ప్రపత్తాంజనేయుని బ్రహ్మోత్సవాలు



విశేష అలంకరణలో శ్రీ ప్రపత్తాంజనేయుడు

పొన్నూరు: మండల పరిధిలోని నండూరులో కొలువైన శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాస శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయని.. 21న ఉదయం విష్వక్సేన పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, జరుగుతాయన్నారు. 22న హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఉదయం నిత్య అనుష్టానములు, స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేక అర్చనలు, శతసహస్ర నాగవల్లీ దళార్చన (లక్ష తమలపాకులతో పూజ), హోమాలు, అనంతరం తీర్థప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. హనుమజ్జన్మ కథ, సాయంత్రం లలితా విష్ణు సహస్రనామ పారాయణ, సహస్ర నామార్చన, హోమం, పంచహారతులు, వేదస్వస్తి ఉంటాయన్నారు. 23న ఉదయం హనుమాన్ చాలీసా పారాయణ, పూజలు, హోమాలు, శ్రీ సువర్చలా హనుమాన్ కల్యాణం, పూర్ణాహుతి నిర్వహిస్తామని పేర్కొన్నారు. 24న సాయంత్రం కల్యాణ మూర్తుల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొనాలని శ్రీనివాస శర్మ కోరారు.

'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

చేబ్రోలు: పహల్గాం ఉగ్రదాడి, పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలకు ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని చేబ్రోలులో మంగళవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ సైనికులు, యువకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి మృతులకు సంతాపం తెలిపారు. జాతీయ పతాకాలతో జీబీసీ ప్రధాన రహదారిలో ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా నాయకులు, పెద్దలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ప్రపంచ దేశాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు వచ్చిందన్నారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం నుంచి పాత పోలీసు స్టేషన్ మీదుగా మెయిన్ రోడ్డులోని గాంధీబొమ్మ సెంటర్, పొట్టి శ్రీరాములు సెంటర్ మీదుగా, ముట్లూరు రోడ్డులోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో తహసీల్దారు కె.శ్రీనివాసశర్మ, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు నారిశెట్టి శ్రీరామచంద్రమూర్తి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మైలా వెంకట రామరాజు, చందు శ్రీరాములు, దానబోయిన శివయ్య, పి.ప్రసాదరెడ్డి, పఠాన్ ఇర్ఫాన్, వీరంకి రంగారావు, పి.సతీష్, కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

పెదకాకాని: ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన సైనిక దళాలకు సంఘీభావంగా మంగళవారం పెదకాకానిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మండల అధికారులు, కూటమి నాయకులు పెదకాకాని ఎంపీడీఓ కార్యాయలం నుంచి బొద్దురాయి సెంటర్ వరకూ జాతీయ పతాకాలతో ర్యాలీలో పాల్గొన్నారు. 'భారత్ మాతాకీ జై' అంటూ ప్రతి ఒక్కరూ నినాదాలు చేశారు. యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణకాంత్, ఈఓపీఆర్డీ కె.శ్రీనివాసరావు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, విద్యార్థులు, మాజీ సైనికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంతు ప్రేమికులు సహకరించాలి

నగర మేయర్ రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, పక్కన కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో వీధి కుక్కల సమస్యల పరిష్కారానికి జంతు ప్రేమికులు, అధికారులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, జంతు ప్రేమికులు, అధికారులతో కలిసి కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలో వీధి కుక్కల వలన సమస్యలు, పరిష్కార మార్గాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో వీధి కుక్కల వలన ఎదురవుతున్న సమస్యలపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి శాశ్వత పద్ధతిలో చర్యలు తీసుకోవాలని కోరారు. వీధి కుక్కల కుటుంబ నియంత్రణకు నగరపాలక సంస్థ చేపడుతున్న చర్యలకు జంతు ప్రేమికులు సహకరించడంతో పాటు, సూచనలను రాతపూర్వకంగా అందించాలని చెప్పారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ వీధి కుక్కలను పట్టుకోవటం, ఏబీసీ చేయడం, ఏబీసీ అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి మూడు ప్రధానాంశాలు ఉంటాయన్నారు. ఏబీసీని నిపుణులైన వైద్యులే చేయాలని మిగిలిన రెండు అంశాల నిర్వహణలో జంతు ప్రేమికుల సంస్థలు కూడా భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, వీఎఎస్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఉపా సెల్ పీఓ రామారావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

ఎంసీ చాగ్లా జీవితం ఆదర్శప్రాయం

నగరంపాలెం: భవిష్యత్ తరాలకు ఎంసీ చాగ్లా జీవితం ఆదర్శప్రాయమని ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కె.జి.శంకర్ అన్నారు. జయ చాముండేశ్వరి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ తెలుగు అనువాదకులు కందిమళ్ల శివప్రసాద్ తెలుగులోకి అనువాదించిన శిశిరంలో గులాబీలు(ఎంసీ చాగ్లా ఆత్మకథ) పుస్తకావిష్కరణ సభ మంగళవారం లక్ష్మీపురం ఆంధ్రప్రదేశ్ కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. గ్రంథావిష్కరణను అన్నమయ్య గ్రంథాలయ స్థాపకులు లంక సూర్యనారాయణ ఆవిష్కరించారు. ప్రముఖ సాహితీవేత్త రావెల సాంబశివరావు మాట్లాడుతూ చాకుల గొప్ప రాజకీయ దురంధరుడు అని అన్నారు. అనువాదకుడు శివప్రసాద్, చాగ్లా వ్యక్తిత్వాన్ని, ఆయన సుదీర్ఘ చరిత్రను తన శిశిరంలో గులాబీలు పుస్తకం ద్వారా వివరించారని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. వామపక్ష ఉద్యమాల నేపథ్యంలో తెలుగులో అనువాద సాహిత్యం వెలువడిందని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నెల్లూరి సత్యనారాయణ, ప్రసిద్ధ కథా రచయిత కె.దయానంద్, ప్రజాసాహితీ దివికుమార్, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, చెరుకూరి సత్యనారాయణ, మోదుగుల రవికృష్ణ, జయ చాముండేశ్వరి పబ్లికేషన్స్ ప్రతినిధి కె.జయలక్ష్మి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి లక్ష మల్లెల పూజ



నగరంపాలెం: కొత్తపేట(నాజ్‌కూడలి)లోని ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంత్యుత్సవాలు మంగళవారం కొనసాగాయి. ఉదయం పంచామృత స్నపన, అనంతరం స్వామికి లక్ష మల్లెల పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మంగళవారం కావడంతో మరింతగా భక్తుల రద్దీ నెలకొంది. హనుమాన్ దీక్షా సమాజం అధ్యక్షులు తిరువళ్లూరు వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించగా, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి టి.సుభద్ర పర్యవేక్షించారు. కార్యక్రమంలో దీక్షా సమాజం సభ్యులు నాగేశ్వరరావు, వంశీ ప్రసాద్, రమేష్, వెంకటరమణ, మారుతి, సుబ్రహ్మణ్యం, బాపిరాజు పాల్గొన్నారు.